చెత్తశుద్ధి లేదాయే!

సునయన ఆడిటోరియానికి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్తా చెదారం



- కలెక్టరేట్‌లో కానరాని పరిశుభ్రత
- ప్రతి విభాగంలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పాత సామగ్రితో డస్ట్ బిన్‌లుగా మారిన ఆవరణాలు

కర్నూలు(సెంట్రల్): జిల్లా ఉన్నతస్థాయి అధికారులు ఉండే కలెక్టరేట్‌లోనే పరిశుభ్రత కరువైంది. ఎక్కడ చూసినా చెత్తా చెదారం పేరుకుపోయింది. తాగి పడేసిన సిగరెట్లు, ప్లాస్టిక కాఫీ, టీ గ్లాసులు, ఉమ్మివేసిన ప్రాంతాలు దర్శనమిస్తున్నాయి. కలెక్టరేట్‌లోని కోఆపరేటివ్, ట్రెజరీ విభాగాల అంతర భాగాలు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ కనీసం చెత్తాచెదారాలను కూడా తీసివేయడంలేదు. ఎక్కడ పడితే అక్కడే పాత బెంచీలు, కుర్చీలు అడ్డుగా ఉన్నాయి. పాత రికార్డులనైతే చెదలు తింటున్నాయి. ఇక డీఆర్వో సెక్షన్‌లు ఇందుకు మినహాయింపేమి లేదు. స్వచ్ఛ నినాదం కేవలం చెప్పేందుకే...చేసేందుకు కాదని, అధికారులకు చిత్తశుద్ధి కరువైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముఖద్వారం మురికికూపం...

కలెక్టరేట్ ముఖద్వారం మురికికూపంగా మారింది. ఇక్కడ మెట్లకింద చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. అక్కడే తాగి వేసిన ప్లాస్టిక్ గ్లాసులు, ఉమ్మిన వేసిన గుట్కాలు, ఇతర మత్తు పదార్థాల ఆనవాళ్ల కనిపిస్తున్నాయి. ఇక్కడ కనీసం శుభ్రం చేయడంలేదు. పాత రికార్డులు, పనికి రాని పరికరాలను కుక్కి దోమలకు నిలయంగా మార్చారు.



ముఖద్వారం మెట్లకింద పేరుకుపోయిన చెత్తాచెదారం

కలెక్టర్, జేసీల చాంబర్ల వద్ద నిలబడాల్సిందే..

కలెక్టర్, జేసీ చాంబర్ల దగ్గర విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరైనా వారిని కలిసేందుకు వస్తే ఎంతసేపైనా నిలబడి ఉండాల్సిందే. అక్కడ కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేవు. ఉన్నవి తప్పు బట్టి పోయాయి. కొన్ని విరిగి పోయాయి. దీంతో వచ్చిన వారు నిలబడి ఉండాల్సిందే. కొన్ని సమయంలో వచ్చిన వారు రెండు, మూడు గంటలు కూడా నిలబడాల్సిందే.



జేసీ, కలెక్టర్ చాంబర్ల దగ్గర తుప్పుబట్టిన కుర్చీలు



కాన్ఫరెన్స్ హాలు సమీపంలో పనిచేయని బాత్ రూం,



డీఆర్వో కార్యాలయ ఆవరణలో...

పరిసరాల పరిశుభ్రత ఒట్టిమాటే..

కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ఉదయం నుంచి దాదాపు రాత్రి వరకు అక్కడే ఉండి పనిచేస్తారు. వీరు ఇంట్లో కంటే కూడా కార్యాలయాల్లోనే ఎక్కువ సమయం గడుపుతారు. అయితే పరిసరాలను పరిశుభ్రంగా మాత్రం ఉంచుకోవడంలేదు. కనీసం క్లీన్ చేయించుకోవడంలేదు. కేవలం కలెక్టర్, జేసీలు, డీఆర్వోలు, ఇతర ఉన్నతాధికారులు వెళ్లే మార్గాల్లోనే కాస్తా పరిశుభ్రతను పాటిస్తారు. మిగిలిన విభాగాల్లో పరిశుభ్రత ఒట్టిమాట.



జేసీ చాంబర్ దగ్గర ప్లాస్టిక్ టీకప్పులు పడేసిన దృశ్యం



సునయన ఆడిటోరియంలో సమీపంలో...

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన



సీఆర్ఆర్ పాఠశాలలో వసతులపై ఆరా తీస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 42వ వార్డుకు సంబంధించి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏపీఎస్పీ క్యాంపులోని సీఆర్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం పరిశీలించారు. ఇప్పటికే ఈ వార్డుకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వార్డులో ఫొటో ఓటర్ల గుర్తింపు కార్యక్రమం పూర్తి చేశారు. తహసీల్దార్, నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫొటో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. దీంతో పోలింగ్‌కు సంబంధించి సీఆర్ఆర్ మున్సిపల్ పాఠశాలలో వసతులు, సౌకర్యాల గురించి కమిషనర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సీటీ ప్లానర్ మోహన్ కుమార్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హరీష్ చౌదరి పాల్గొన్నారు.

9 నుంచి దశల వారీగా ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే మార్చి 9 నుంచి దశల వారీగా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ చేబ్రోలు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం కర్నూలు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ హాజరై మాట్లాడారు. ముఖంగా పీఆర్‌సీ పెండింగ్ బకాయిలు, డీఏలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీపీఎఫ్ నిధులు, ఆరోగ్య కార్డుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అయితే దాదాపు మూడున్నరేళ్లు గడిచినా అధికారులుగాని, ప్రభుత్వంగాని స్పందించలేదన్నారు. ఈక్రమంలో ఉద్యోగులుగా ఉద్యమానికి వెళ్లాల్సిన బాధ్యతపై తమ ఉందన్నారు. ఉద్యోగులందరూ ఐకమత్యంతో ప్రభుత్వంపై పోరుకు తమతో కలసి రావాలన్నారు.

ఘనంగా ఈలపాట రఘురామయ్య జయంతి



రఘురామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: కర్నూలు రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఈలపాట రఘురామయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు కళాకారులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గుర్రపుసాల అంకయ్య మాట్లాడుతూ రఘురామయ్య రంగస్థల కళాకారుడుగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించి కళామతల్లికి ఎంతో సేవ చేశారన్నారు. నటునిగా, ఈలపాట గాయకునిగా ఎన్నో అవార్డులు కైవసం చేసుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. సంఘం కార్యదర్శి హనుమంతరావు చౌదరి, ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, రోషన్‌అలీ, సభ్యులు మనోహర్‌బాబు, నాగరాజు, రాముడు, జయరాముడు, షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, బలగం, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్

వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, సార్, బలగం, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, వినరో భాగ్యము విష్ణు కథ, గ్యాంగ్ లీడర్

వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, బలగం, వినరో భాగ్యము విష్ణు కథ

ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వ్యాస్ప్ క్వాంటమేనియా, క్రీడ్-3

భరత్ కాంప్లెక్స్:బిగ్‌స్నేక్‌కింగ్, వాల్తేరు వీరయ్య

రాజ్ : గ్యాంగ్ లీడర్

శ్రీరామ : గ్రంథాలయం

విజయ : వినరో భాగ్యము విష్ణు కథ

ఎన్నికల్లో గెలిపిస్తే మరింత మెరుగైన పాలన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి సంక్షేమ ప్రభుత్వాన్ని బలపర్చాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆయన 9వ వార్డు పింజరి వీధిలో శాసన మండలి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్వీ యూత్ యువత పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కోరారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వాలను పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నిలదీస్తారన్నారు. వీరిని శాసనమండలికి పంపితే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే 45వ వార్డు పరిధిలో చిన్న వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

నాటిన మొక్కలను కాపాడుకుందాం



జగన్నాథగట్టుపై నాటిన మొక్కలకు నీళ్లు పోస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై నాటిన మొక్కలను కాపాడటంపై అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు శ్రీకారం చుట్టారు. ఏడాది కాలంగా జగన్నాథగట్టుపై పచ్చదనం అభివృద్ధి కోసం మొక్కలను పెద్ద ఎత్తున నాటారు. ప్రస్తుతం వేసవిలో ఎండల తీవ్రతకు మొక్కలు ఎండపోకుండా కాపాడేందుకు వాటిని నాటిన వారే నడుం బిగించారు. ఆదివారం సెలవు కావడంతో పలువురు ఉద్యోగులు, విశ్రాంత అధికారులు, విద్యార్థులు మొక్కలకు బిందెలతో నీళ్ల పోశారు. వారం, వారం నీళ్లు పోసి మొక్కలను కాపాడాలని నిర్ణయించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎఫ్‌వో బి.జయచంద్రారెడ్డి, పెద్దటేకూరుకు చెందిన వర్మీ కంపోస్ట్ యూనిట్ నిర్వాహకులు హరికృష్ణ, పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో మంచు మనోజ్ సందడి



ఎస్వీ సుబ్బారెడ్డి ఆశీస్సుల కోసం వచ్చిన మంచు మనోజ్, భూమా మౌనికారెడ్డి

కర్నూలు కల్చరల్: నూతన వధూవరులు మంచు మనోజ్, భూమా మౌనికా రెడ్డిలు ఆదివారం కర్నూలు నగరానికి వచ్చారు. హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు వెళుతూ కర్నూలు గిప్సన్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్వగృహానికి వచ్చారు. మౌనికా రెడ్డి తాత మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి, మేన మామ ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరిల ఆశీస్సులు అందుకున్నారు. వరుడు, సినీ హీరో మనోజ్ రాకతో సందడి నెలకొంది. మంచు, భూమా, ఎస్వీ ఫ్యామిలీ అభిమానులు అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. అనంతరం నూతన వధూవరులు ఆళ్లగడ్డకు వెళ్లారు.

సీపీఆర్‌తో మరణాలు తగ్గించవచ్చు



డాక్టర్ వసంతకుమార్‌ను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): అకస్మాత్తుగా వచ్చే గుండెపోటు మరణాలను సీపీఆర్ చేయడం ద్వారా తగ్గించవచ్చని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో 'సడెన్ కార్డియాక్ అరెస్ట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ విషయమై డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ మన గుండె నిత్యం 60మైళ్ల పొడవుండే రక్తనాళాల ద్వారా అన్ని అవయవాలకు రక్తం పంప్ చేస్తూ ఉంటుందన్నారు. గుండెలో ఏర్పడ్డ బ్లాక్‌లు, విద్యుత్ షాక్‌ల కారణంగా గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ రావడంతో గుండె, మెదడుకు రక్తసరఫరా ఆగిపోతుందన్నారు. ఇలాంటి సమయంలో ఛాతిపై సీపీఆర్ చేస్తే మెదడుకు రక్తసరఫరా పునరుద్ధరించబడి కోలుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై శిక్షణ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ భవానీ ప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, వెంకటరాముడు, లక్ష్మన్న సన్మానించారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి

– ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్ ఖాన్ ఆదివారం రాత్రి 42వ వార్డు, ఎస్ఏపీ క్యాంప్ తదితర ప్రాంతాల్లో శాసన మండలి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. పాలన మరింత మెరుగ్గా ఉండాలంటే మండలిలోనూ పూర్తి మెజారిటీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన బలపర్చిన వ్యక్తికే ఓటు వేయడంతో పాటు వేయించాలని బ్యాలెట్ పేపరు చూపించి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాశిరెడ్డి శ్వేతారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సవారి, హరికృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త శ్రమించాలి

మండలి ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారని వెల్లడించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన, ప్రజలకు చేస్తున్న మంచిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేలా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం పార్టీ కర్నూలు పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వాన్ని బలపర్చేందుకు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం ప్రతి కార్యకర్త, కన్వీనర్లు, కార్పొరేటర్లు మరింత బాగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, కుమారస్వామిరెడ్డి, ఎస్. ప్రసాద్, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హడావుడిగా కొని..మూలన పడేసి!



వ్యవసాయ శాఖలో మూలన పడిన జిరాక్స్ మిషన్లు, కూలర్లు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ కార్యాలయల్లో జిరాక్స్ మిషన్లు, కూలర్ల పేర్లతో నిధులను అడ్డుగోలుగా దుర్వినియోగం చేస్తున్నారు. ఎంత హడావుడిగా కొనుగోలు చేస్తారో.. అంతే త్వరగా పక్కన పడేయడం పరిపాటి అయింది. పట్టుమని ఏడాది కూడా వినియోగించడం లేదు. ప్రభుత్వానిదే కదా.. అనే నిర్లక్ష్య భావన అధికారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. వ్యవసాయ శాఖలో ఏకంగా రూ.6 లక్షల విలువ జిరాక్స్ మిషన్లతో పాటు కూలర్లు మూలన పడేశారు. ఒక్క వ్యవసాయ శాఖలోనే కాదు..కలెక్టరేట్‌లోని అన్ని శాఖల్లో ఇలాగే ఉంది పరిస్థితి. కార్యాలయాల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా లేకపోయినప్పటికీ ఫ్యాన్‌లు తిరుగుతుంటాయి.. లైట్లు వెలుగుతుంటాయి. బంద్ చేద్దామనే ఆలోచన ఎవ్వరికీ ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

క్రికెట్ లీగ్ విజేత గణేష్ జట్టు



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ వాసు, దోన పాటి ఎల్లారెడ్డి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బంగారుపేట ప్రీమియర్ క్రికెట్ లీగ్ విజేతగా గణేష్ టీమ్ నిలిచింది. కర్నూలు బళ్లారి దుర్గామాత జాతర మహోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మొత్తం 22 టీములు పాల్గొన్నాయి. పోటీల్లో విన్నర్స్‌గా గణేష్ టీమ్, రన్నర్స్‌గా మ్యాడ్ మాక్స్ టీమ్, మూడో స్థానంలో నందికొట్కూరు జట్టు నిలిచాయి. ఆయా జట్లకు అతిథులు డాక్టర్ వాసురెడ్డి, దోనపాటి ఎల్లా రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు వరుసగా రూ.30 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక నగదుతో పాటు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ బంగారుపేట యువత ముందుకు వచ్చి క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. షికారీలలో మార్పు తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రికెట్ లీగ్ నిర్వాహకులు ఎస్.సురేష్‌బాబు, ఎస్.శేఖర్, ఫ్లవర్ డెకరేటర్ శివ, హాకీ శివ తదితరులు పాల్గొన్నారు.

అతివలు అన్నిరంగాల్లో రాణించాలి



వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మానవత సంస్థ ప్రతినిధులు

– ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు కల్చరల్: అతివలు అన్నిరంగాల్లో ఉన్నతంగా రాణించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎంఐ ఫంక్షన్ హాల్‌లో ఔత్సాహిక మహిళలచే ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను, బాలికలను ఆయన ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ మహిళా విభాగం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రస్తుతం మహిళలకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. వివిధ రంగాల్లో ఎదగడంతో పాటు ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు యానీ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుకారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, సంస్థ మాజీ అధ్యక్షులు పాటిల్ హనుమంతరెడ్డి, జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి, అధ్యక్షులు యుగంధర్ శెట్టి, బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్, మహిళా సభ్యులు అపర్ణ, దీప, ఉమ, లక్ష్మి మాట్లాడారు. మహిళాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మానవత సభ్యులు పాల్గొన్నారు.

పీడితుల పక్షాన రాసే కవిత్వమే ప్రజా కవిత్వం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: పీడితుల పక్షాన రాసేసే కవిత్వమే ప్రజా కవిత్వమని ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో మహమూద్ రాసిన ఆస్మాని కవిత్వం, పావని రాసిన సిక్స్ ప్యాక్ రాముడు కథల పుస్తకం, అరుణ్ రాసిన కాంతి అలలు కవిత్వం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. కవులు లక్ష్మీ నరసయ్య, వెంకటకృష్ణ, పాణిలు పుస్తకాలను పరిచయం చేసి ప్రసంగించారు. ప్రపంచీ కరణ అనంతరం డిజిటల్ సమాజ మార్పులు, ఆమార్పుల్లో భాగంగా సామ్రాజ్య వాదం కొత్త శక్తుల దోపిడీ అవతారాలను కవులు తమ రచనల ద్వారా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు జంధ్యాల రఘుబాబు, సయ్యద్ జహీర్ అహ్మద్, ఇనాయతుల్లా, ఏవీరెడ్డి, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ అరుణ, మారుతి, సుభాషిణి, రత్నం ఏసేపు పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: స్థానిక బుధవారపేటలోని నృసింహ సరస్వతి స్వామి ఆలయం వార్షికోత్సవం ఈ నెల 7వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త కోటేశ్వరప్ప తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరశైవ లింగాయతి ధర్మ సంస్కృతికి పాటు పడిన సంఘం ప్రముఖులకు సన్మానం, నృసింహ సరస్వతి భక్తి గీతాల పుస్తకావిష్కరణ ఉంటాయని తెలిపారు.